# రూతు

1 న్యాయాధిపతులు ఏలిన దినములయందు దేశ
ములో కరవు కలుగగా యూదా బేత్లెహేమునుండి
ఒక మనుష్యుడు తన భార్యను తన యిద్దరు కుమారు
లను వెంటబెట్టుకొని మోయాబుదేశమున కాపుర
2 ముండుటకు వెళ్ళెను.। ఆ మనుష్యునిపేరు ఎలీమె
లెకు, అతని భార్యపేరు నయోమి; అతని యిద్దరు
కుమారుల పేళ్లు మహ్లోను కిల్యోను; వారు యూదా
బేత్లెహేమువారైన ఎఫ్రాతీయులు; వారు మోయాబు
3 దేశమునకు వెళ్లి అక్కడ కాపురముండిరి.। నయోమి
పెనిమిటియైన ఎలీమెలెకు చనిపోయిన తరువాత
ఆమెయు ఆమె యిద్దరు కుమాళ్లును నిలిచియుండిరి.।
4 వారు మోయాబుస్త్రీలను పెండ్లి చేసికొనిరి. వారిలో
5 ఒకదానిపేరు ఓర్పా రెండవదానిపేరు రూతు.। వారు
ఇంచుమించు పది సంవత్సరములు అక్కడ నివసించిన
తరువాత మహ్లోను కిల్యోనను ఇద్దరును చనిపోయిరి;
కాగా ఆ స్త్రీ తాను కనిన యిద్దరు కుమారులును తన
6 పెనిమిటియు లేనిదాయెను.। వారికి ఆహారమిచ్చుటకు
యెహోవా తన జనులను దర్శించెనని ఆమె మోయా
బుదేశములో వినెను గనుక మోయాబు దేశము విడిచి
వెళ్లుటకై ఆమెయు ఆమె కోడండ్రును ప్రయాణమైరి.।
7 అప్పుడు ఆమెయున్న స్థలమునుండి ఆమెతోకూడ
ఆమె యిద్దరు కోడండ్రును బయలుదేరి యూదాదేశ
మునకు తిరిగి పోవలెనని మార్గమున వెళ్లు చుండగా।
8 నయోమి తన యిద్దరు కోడండ్రను చూచి–మీరు మీ
తల్లుల యిండ్లకు తిరిగి వెళ్లుడి; చనిపోయిన వారి
యెడలను నా యెడలను మీరు దయచూపినట్లు
9 యెహోవా మీ యెడల దయచూపునుగాక;। మీలో
ఒక్కొక్కతె పెండ్లి చేసికొని తన యింట నెమ్మదినొందు
నట్లు యెహోవా దయచేయును గాక అని వారితో చెప్పి
10 వారిని ముద్దు పెట్టుకొనెను.। అంతట వారు ఎలుగెత్తి
యేడ్చి–నీ ప్రజలయొద్దకు నీతోకూడ వచ్చెదమని
11 ఆమెతో చెప్పగా। నయోమి–నా కుమార్తెలారా, మీరు
మరలుడి; నాతోకూడ మీరు రానేల? మిమ్మును పెండ్లి
చేసికొనుటకై యింక కుమారులు నా గర్భమున
12 నుందురా?। నా కుమార్తెలారా, తిరిగి వెళ్లుడి, నేను
పురుషునితో నుండలేని ముసలిదానను; నాకు నమ్మిక
కలదని చెప్పి ఈ రాత్రి పురుషునితోనుండి కుమారు
13 లను కనినను। వారు పెద్ద వారగువరకు వారి కొరకు
మీరు కనిపెట్టుకొందురా? మీరు వారికొరకు కనిపెట్టు
కొని పురుషులు లేక యొంటరి కత్తెలై యుందురా?
నా కుమార్తెలారా, అది కూడదు; యెహోవా నాకు
విరోధియాయెను; అది మిమ్మును నొప్పించినంత
కంటె నన్ను మరి యెక్కువగా నొప్పించినదని వారితో
చెప్పెను.। వారు ఎలుగెత్తి యేడ్వగా ఓర్పా తన అత్తను 14
ముద్దుపెట్టుకొనెను, రూతు ఆమెను హత్తు కొనెను.
ఇట్లుండగా। ఆమె–ఇదిగో నీ తోడికోడలు తన జనుల 15
యొద్దకును తన దేవునియొద్దకును తిరిగి పోయినదే;
నీవును నీ తోడికోడలి వెంబడివెళ్లుమనెను.। అందుకు 16
రూతు–నా వెంబడి రావద్దనియు నన్ను విడిచి పెట్టు
మనియు నన్ను బ్రతిమాలుకొనవద్దు. నీవు వెళ్లు చోటికే
నేను వచ్చెదను, నీవు నివసించుచోటనే నేను నివ
సించెదను, నీ జనమే నా జనము నీ దేవుడే నా దేవుడు;।
నీవు మృతి బొందుచోటను నేను మృతిచెందెదను, 17
అక్కడనే పాతిపెట్టబడెదను. మరణము తప్ప మరి
ఏదైనను నిన్ను నన్ను ప్రత్యేకించినయెడల యెహోవా
నాకు ఎంత కీడైన చేయునుగాక అనెను.। తనతోకూడ 18
వచ్చుటకు ఆమెకు మనస్సు కుదిరినదని నయోమి
తెలిసి కొనినప్పుడు అందునుగురించి ఆమెతో మాట
లాడుట మానెను గనుక వారిద్దరు బేత్లెహేమునకు
వచ్చువరకు ప్రయాణము చేసిరి.। వారు బేత్లెహేము 19
నకు వచ్చినప్పుడు ఆ ఊరివారందరు వారియొద్దకు
గుంపుకూడి వచ్చి–ఈమె నయోమి గదా అని అను
కొనుచుండగా। ఆమె–సర్వశక్తుడు నాకు చాలా 20
దుఃఖము కలుగజేసెను గనుక నన్ను నయోమి[1] అనక
మారా[2] అనుడి.। నేను సమృద్ధిగల దాననై వెళ్లితిని, 21
యెహోవా నన్ను రిక్తురాలినిగా తిరిగి రాజేసెను. మీరు
నన్ను నయోమి అని పిలువనేల? యెహోవా నామీద
విరుద్ధముగ సాక్ష్యము పలికెను, సర్వశక్తుడు నన్ను
బాధపరచెను అని వారితో చెప్పెను.। అట్లు నయో 22
మియు ఆమెతోకూడ మోయాబీయురాలైన రూతు
అను ఆమె కోడలును మోయాబుదేశమునుండి తిరిగి
వచ్చిరి. వారిద్దరు యవలకోత ఆరంభములో బేత్లె
హేము చేరిరి.

నయోమి పెనిమిటికి బంధువు డొకడుండెను. 2
అతడు చాల ఆస్తిపరుడు, అతడు ఎలీమెలెకు వంశపు
వాడై యుండెను, అతని పేరు బోయజు.। మోయా 2

[1] మధురము. [2] చేదు.

బీయు రాలైన రూతు—నీ సెలవైనయెడల నేను పొల
ములోనికి పోయి, యెవని కటాక్షము పొందగలనో వాని
వెనుక పరిగె నేరుకొందునని నయోమితో చెప్పగా
3 ఆమె—నా కూమారీ పొమ్మనెను.। కాబట్టి ఆమె వెళ్లి
పొలములోనికి వచ్చి చేను కోయువారి వెనుక పొల
ములో ఏరుకొనెను. ఆ పొలములో ఆమె పోయిన
భాగము ఎలీమెలెకు వంశపువాడైన బోయజుది.।
4 బోయజు బేత్లెహేమునుండి వచ్చి—యెహోవా మీకు
తోడై యుండునుగాకని చేనుకోయువారితో చెప్పగా
వారు—యెహోవా నిన్ను ఆశీర్వదించును గాకనిరి.।
5 అప్పుడు బోయజు కోయువారిమీద ఉంచబడిన తన
పనివానిని చూచి — ఈ చిన్నది ఎవరిదని అడుగగా।
6 కోయువారిమీద నుంచబడిన ఆ పనివాడు—ఈమె
మోయాబుదేశమునుండి నయోమితో కూడ తిరిగి
7 వచ్చిన మోయాబీయురాలైన యౌవనురాలు.। ఆమె—
నేను కోయువారి వెనుకకు పనల మధ్యను ఏరుకొని
కూర్చుకొనుటకు దయచేసి నాకు సెలవిమ్మని అడి
గెను. ఆమె వచ్చి ఉదయము మొదలుకొని యిది
వరకు ఏరుకొను చుండెను, కొంతసేపు మాత్రము ఆమె
8 యింట కూర్చుండెనని వాడు చెప్పెను.। అప్పుడు
బోయజు రూతుతో—నా కుమారీ, నా మాట వినుము;
వేరొక పొలములో ఏరుకొనుటకు పోవద్దు, దీనిని విడిచి
పోవద్దు, ఇచ్చట నా పనికత్తెలయొద్ద నిలకడగా
9 ఉండుము.। వారు కోయుచేను కనిపెట్టి వారిని వెంబ
డించుము, నిన్ను ముట్టకూడదని యౌవనస్థులకు
ఆజ్ఞాపించి యున్నాను, నీకు దాహముగునప్పుడు
కుండలయొద్దకు పోయి పనివారు చేదిన నీళ్లు త్రాగు
10 మని చెప్పెను.। అందుకు ఆమె సాగిలపడి తల
వంచుకొని—ఏమి తెలిసి పరదేశినైన నాయందు లక్ష్య
ముంచునట్లు నీకు కటాక్షము కలిగెనో అని చెప్పగా
బోయజు—నీ పెనిమిటి మరణమైన తరువాత నీవు నీ
11 అత్తకు చేసినదంతయు నాకు తెలియబడెను.। నీవు
నీ తలిదండ్రులను నీ జన్మభూమిని విడిచి, యింతకు
ముందు నీవు ఎరుగని జనము నొద్దకు వచ్చితివి.।
12 యెహోవా నీవు చేసినదానికి ప్రతిఫలమిచ్చును;
ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కలక్రింద
సురక్షితముగా నుండునట్లు నీవు వచ్చితివి; ఆయన
నీకు సంపూర్ణమైన బహుమాన మిచ్చునని ఆమెకుత్తర
13 మిచ్చెను.। అందుకు ఆమె—నా యేలిన వాడా, నేను
నీ పనికత్తెలలో ఒకదానను కాకపోయినను, నీవు
నన్నాదరించి నీ దాసురాలినగు నాయందు ప్రేమగలిగి
మాటలాడితివి గనుక నాయెడల నీకు కటాక్షము
14 కలుగనిమ్మని చెప్పెను.। బోయజు—భోజనకాలమున
నీ విక్కడికి వచ్చిభోజనముచేసి, చిరకలో నీ ముక్క
ముంచి, తినుమని ఆమెతో చెప్పగా, చేను కోయు
వారియొద్ద ఆమె కూర్చుండెను. అతడు ఆమెకు
పేలాలు అందియ్యగా ఆమె తిని తృప్తిపొంది కొన్ని
మిగిల్చెను.। ఆమె యేరుకొనుటకు లేచినప్పుడు 15
బోయజు—ఆమె పనలమధ్యను ఏరుకొనవచ్చును,
ఆమెను అవమానపరచకుడి। మరియు ఆమెకొరకు 16
పిడికెళ్లు పడవేసి ఆమె యేరుకొనునట్లు విడిచిపెట్టుడి,
ఆమెను గద్దింపవద్దని తన దాసుల కాజ్ఞాపించెను.।
కాబట్టి ఆమె అస్తమయము వరకు ఆ చేనిలో ఏరు 17
కొనుచు, తాను ఏరుకొనిన దానిని దుల్లకొట్టగా అవి
దాదాపు తూమెడు యవలాయెను.। ఆమె వాటిని 18
ఎత్తికొని ఊరిలోనికి వచ్చినప్పుడు ఆమె అత్త ఆమె
యేరుకొనిన వాటిని చూచెను. ఆమె తిని తృప్తిపొందిన
తరువాత తాను మిగిల్చినదానిని చూపించి ఆమె
కిచ్చెను.। అంతట ఆమె అత్త ఆమెతో—నేడు నీవెక్కడ 19
ఏరు కొంటివి? ఎక్కడ పనిచేసితివి? నీయందు లక్ష్య
ముంచిన వాడు దీవింపబడునుగాక అనగా, ఆమె తాను
ఎవని యొద్ద పనిచేసెనో అది తన అత్తకు తెలియ
చెప్పి—ఎవని యొద్ద నేడు పనిచేసితినో అతనిపేరు
బోయజు అనెను.। నయోమి—బ్రదికియున్న వారికిని 20
చచ్చినవారికిని ఉపకారము చేయుట మానని యితడు
యెహోవాచేత ఆశీర్వదింపబడునుగాక అని తన
కోడలితో అనెను. మరియు నయోమి—ఆ మనుష్యుడు
మనకు సమీపబంధువుడు, అతడు మనలను విడి
పింపగల వారిలో ఒకడని చెప్పగా। మోయాబీ 21
యురాలైన రూతు—అంతేకాదు, అతడు నన్ను చూచి,
తనకు కలిగిన పంటకోత అంతయు ముగించువరకు
తన పని వారియొద్ద నిలకడగా ఉండుమని నాతో
చెప్పెననెను.। అప్పుడు నయోమి తన కోడలైన 22
రూతుతో—నా కుమారీ, అతని పనికత్తెలతో కూడనే
బయలుదేరుచు వేరొక చేనిలోనివారికి నీవు కనబడక
పోవుట మంచిదనెను.। కాబట్టి యవలకోతయు గోధుమ 23
లకోతయు ముగియువరకు ఆమె యేరుకొనుచు
బోయజు పనికత్తెలయొద్ద నిలకడగానుండి తన అత్త
యింట నివసించెను.

ఆమె అత్తయైన నయోమి—నా కుమారీ, నీకు మేలు 3
కలుగునట్లు నేను నీ కొరకు విశ్రాంతి విచారింపవలసిన
దానను గదా.। ఎవని పనికత్తెలయొద్ద నీవు ఉంటివో 2
ఆ బోయజు మనకు బంధువుడు. ఇదిగో యీ రాత్రి
అతడు కళ్లమున యవలు తూర్పారబట్టింప బోవు
చున్నాడు.। నీవు స్నానముచేసి తైలము రాచుకొని నీ 3
బట్టలు కట్టుకొని ఆ కళ్లమునకు వెళ్లుము; అతడు
అన్నపానములు పుచ్చుకొనుట చాలించువరకు నీవు
అతనికి మరుగైయుండుము.। అతడు పండుకొనిన 4

తరువాత అతడు పండుకొనిన స్థలమును గుర్తెరిగి
లోపలికి పోయి అతని కాళ్లమీద నున్న బట్ట తీసి
పండుకొనవలెను; నీవు చేయవలసినదానిని అతడు
5 నీకు తెలియజేయునని ఆమెతో అనగా। ఆమె—నీవు
6 సెలవిచ్చినదంతయు చేసెదనని చెప్పి। ఆ కళ్లము
నొద్దకు పోయి తన అత్త ఆజ్ఞాపించిన దంతయు
7 చేసెను.। బోయజు మనస్సున సంతోషించునట్లు
అన్నపానములు పుచ్చుకొని లోపలికి పోయి ధాన్యపు
కుప్పయొద్ద పండుకొనినప్పుడు ఆమె మెల్లగా పోయి
8 అతని కాళ్లమీదనున్న బట్ట తీసి పండుకొనెను.। మధ్య
రాత్రియందు అతడు ఉలికిపడి తిరిగి చూచినప్పుడు,
ఒక స్త్రీ అతని కాళ్లయొద్ద పండుకొని యుండెను.।
9 అతడు—నీ వెవరవని అడుగగా ఆమె—నేను రూతు
అను నీ దాసురాలిని; నీవు నాకు సమీప బంధువుడవు
గనుక నీ దాసురాలిమీద నీ కొంగు కప్పు మనగా।
10 అతడు—నా కుమారీ, యెహోవాచేత నీవు దీవెన
నొందినదానవు; కొద్దివారినే గాని గొప్పవారినే గాని
యౌవనస్థులను నీవు వెంబడింపక యుండుటవలన
నీ మునుపటి సత్ ప్రవర్తనకంటె వెనుకటి సత్ప్రవర్తన
11 మరి ఎక్కువైనది.। కాబట్టి నా కుమారీ, భయపడకుము;
నీవు చెప్పినదంతయు నీకు చేసెదను. నీవు యోగ్యు
12 రాలవని నా జనులందరు ఎరుగుదురు.। నేను నిన్ను
విడిపింపగలవాడనను మాట వాస్తవమే; అయితే నీకు
13 నాకంటె సమీపమైన బంధువు డొకడున్నాడు.। ఈ రాత్రి
యుండుము; ఉదయమున అతడు నీకు బంధువుని
ధర్మము జరిపినయెడల సరి, అతడు విడిపింపవచ్చును.
నీకు బంధువుని ధర్మము జరుపుటకు అతనికి ఇష్టము
లేక పోయినయెడల, యెహోవా జీవముతోడు నేనే
నీకు బంధువుని ధర్మము జరిపెదను; ఉదయమువ
14 రకు పండుకొనుమని చెప్పెను.। కాబట్టి ఆమె ఉదయ
మువరకు అతని కాళ్లయొద్ద పండుకొని, ఒకని నొకడు
గుర్తించుపాటి వెలుగు రాకముందే లేచెను. అప్పుడు
అతడు—ఆ స్త్రీ కళ్లమునకు వచ్చిన సంగతి తెలియ
15 జేయకుడని చెప్పెను.। మరియు అతడు—నీవు వేసి
కొనిన దుప్పటి తెచ్చి పట్టుకొనుమని చెప్పగా ఆమె
దాని పట్టెను. అతడు ఆరుకొలల యవలను కొలచి
ఆమె భుజముమీద నుంచగా ఆమె పురములోనికి
16 వెళ్లెను.। ఆమె తన అత్త యింటికి వచ్చినప్పుడు అత్త—
నా కుమారీ, నీ పని యెట్లు జరిగెనని యడుగగా,
ఆమె ఆ మనుష్యుడు తనకు చేసిన దంతయు
17 తెలియజేసి। —నీవు వట్టిచేతులతో నీ అత్త యింటికి
పోవద్దని చెప్పి అతడు ఈ ఆరు కొలల యవలను
18 నాకిచ్చె ననెను.। అప్పుడు ఆమె—నా కుమారీ, యీ
సంగతి నేటిదినమున నెరవేర్చితేనే కాని ఆ మను
ష్యుడు ఊర కుండడు గనుక యిది ఏలాగు జరుగునో
నీకు తెలియువరకు ఊరకుండుమనెను.

బోయజు పురద్వారమునొద్దకు పోయి అక్కడ **4**
కూర్చుండగా, బోయజు చెప్పిన బంధువుడు ఆ
త్రోవను పోవుచుండెను గనుక బోయజు—ఓయి, యీ
తట్టు తిరిగి ఇక్కడ కూర్చుండుమని అతని పిలువగా
అతడు వచ్చి కూర్చుండెను.। బోయజు ఆ ఊరి పెద్ద 2
లలో పదిమందిని పిలిపించుకొని, ఇక్కడ కూర్చుండు
డని చెప్పగా వారును కూర్చుండిరి.। అతడు— 3
మోయాబు దేశమునుండి తిరిగి వచ్చిన నయోమి మన
సహోదరుడైన ఎలీమెలెకునకు కలిగిన భూభాగమును
అమ్మివేయుచున్నది గనుక నీవు చెవులార వినునట్లు
నేనొకసంగతి తెలియజేయవలెనని యున్నాను.। ఈ 4
పుర నివాసులయెదుటను నా జనుల పెద్దలయెదుటను
ఆ భూమిని సంపాదించుకొనుము; ఏమనగా దాని
విడిపించుటకు నీవు ఒప్పుకొనిన యెడల విడిపింపుము,
దాని విడిపింపనొల్లని యెడల అది స్పష్టముగా నాతో
చెప్పుము. నీవు గాక దాని విడిపింపవలసిన బంధు
వుడెవడును లేడు; నీ తరువాతివాడను నేనే అని
బంధువునితో చెప్పెను. అందుకతడు—నేను విడి
పించెద ననెను.। బోయజు—నీవు నయోమి చేతినుండి 5
ఆ పొలమును సంపాదించు దినమున చనిపోయిన
వానిపేరట అతని స్వాస్థ్యమును స్థిరపరచునట్లు చని
పోయినవాని భార్యయైన రూతు అను మోయాబీ
యురాలి యొద్ద నుండియు దాని సంపాదింపవలెనని
చెప్పగా। ఆ బంధువుడు— నేను దానిని విడిపించుకొన 6
లేను, నా స్వాస్థ్యమును పోగొట్టుకొందునేమో, నేను
దాని విడిపింపలేను గనుక నీవే నాకు ప్రతిగా బంధు
వుని ధర్మము జరిగించుమని చెప్పెను.। ఇశ్రాయేలీ 7
యులలో బంధు ధర్మమునుగూర్చిగాని, క్రయవిక్రయ
ములను గూర్చిగాని, ప్రతి సంగతిని స్థిరపరచుటకు
పూర్వమున జరిగిన మర్యాద ఏదనగా, ఒకడు తన
చెప్పు తీసి తన పొరుగువాని కిచ్చుటయే. ఈ పని
ఇశ్రాయేలీయులలో ప్రమాణముగా ఎంచబడెను.। ఆ 8
బంధువుడు—నీవు దానిని సంపాదించుకొను మని
బోయజుతో చెప్పి తన చెప్పుతీయగా। బోయజు— 9
ఎలీమెలెకునకు కలిగినది యావత్తును కిల్యోనుకును
మహ్లోనుకును కలిగినది యావత్తును నయోమి చేతి
నుండి సంపాదించితినని నేనన్నందుకు మీరు ఈ
దినమున సాక్షులై యున్నారు.। మరియు చనిపోయిన 10
వాని పేరట అతని స్వాస్థ్యమును స్థిరపరచునట్లును,
చనిపోయినవాని పేరు అతని సహోదరులలోనుం
డియు, అతని స్థలముయొక్క ద్వారము నుండియు
కొట్టివేయబడక యుండునట్లును, నేను మహ్లోను
భార్యయైన రూతును మోయాబీయురాలిని సంపా
దించుకొని పెండ్లిచేసికొనుచున్నాను. దీనికి మీరు ఈ
దినమున సాక్షులై యున్నారని పెద్దలతోను ప్రజలంద
రితోను చెప్పెను.। అందుకు పురద్వారమునసుండిన 11

ప్రజలందరును పెద్దలును—మేము సాక్షులము,
యెహోవా నీ యింటికి వచ్చిన ఆ స్త్రీని ఇశ్రాయేలీ
యుల వంశమును వర్ధిల్లజేసిన రాహేలును పోలిన
దానిగాను లేయాను పోలిన దానిగాను చేయును గాక;
12 ఎఫ్రాతాలో నీవు క్షేమాభివృద్ధి కలిగినవాడవై బేత్లె
హేములో నీవు ఖ్యాతి నొందుదువు గాక; యెహోవా
యీ యౌవనురాలివలన నీకు దయచేయు సంతాన
మును నీ కుటుంబమును తామారు యూదాకు కనిన
13 పెరెసు కుటుంబమువలె నుండునుగాక అనిరి. కాబట్టి
బోయజు రూతును పెండ్లిచేసికొని ఆమె యొద్దకు
పోయినప్పుడు యెహోవా ఆమె గర్భవతి యగునట్లు
అనుగ్రహించెను గనుక ఆమె కుమారునికనెను.
14 అప్పుడు స్త్రీలు—ఈ దినమున నీకు బంధువుడు
లేకుండ చేయని యెహోవా స్తుతినొందునుగాక; ఆయన
నామము ఇశ్రాయేలీయులలో ప్రకటింపబడునుగాక.

నిన్ను ప్రేమించి యేడుగురు కుమారులకంటె నీ 15
కెక్కువగానున్న నీ కోడలు ఇతని కనెను; ఇతడు నీ
ప్రాణము నోదార్చి ముసలితనమున నీకు పోషకుడ
గునని నయోమితో చెప్పిరి. అప్పుడు నయోమి— 16
ఆ బిడ్డను తీసికొని కౌగిట నుంచుకొని వానికి దాదిగా
నుండెను. ఆమె పొరుగు స్త్రీలు—నయోమికొరకు 17
కుమారుడు పుట్టెనని చెప్పి అతనికి ఓబేదను పేరు
పెట్టిరి. అతడు దావీదునకు తండ్రియైన యెష్షయి
యొక్క తండ్రి.

పెరెసు వంశావళి యేదనగా—పెరెసు హెస్రోనును 18
కనెను, హెస్రోను రామును కనెను, రాము అమ్మీనాదా 19
బును కనెను, అమ్మీనాదాబు నయస్సోనును కనెను,
నయస్సోను శల్మానును కనెను, శల్మాను బోయజును 20
కనెను, బోయజు ఓబేదును కనెను, ఓబేదు యెష్షయిని 21
కనెను, యెష్షయి దావీదును కనెను.